
సాక్షి
మెదక్
సోమవారం । 7 । జూలై । 2025

ఫలాంబరిగా వన దుర్గమ్మ



ఆషాఢమాసం ఆదివారం వన దుర్గమ్మ భక్తులకు ఫలాంబరిగా దర్శనమిచ్చారు. అర్చకులు శంకర శర్మ, పార్థివశర్మ అమ్మవారిని తీరొక్క ఫలాలతో అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఒడిబియ్యం పోసి, బోనాలు తీసి మొక్కులు చెల్లించుకున్నారు. ఇబ్బందులు కలగకుండా ఆలయ సిబ్బంది, పోలీసులు చర్యలు చేపట్టారు.

-పాపన్నపేట(మెదక్)



ఏడుపాయలలో భక్తుల సందడి

న్యూస్‌రీల్

శ్యాంప్రసాద్ ముఖర్జీకి నివాళి



శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మెదక్‌జోన్: జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతిని ఆపార్టీ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గడ్డం కాశీనాథ్, నేతలు సుభాష్‌గౌడ్, ప్రసాద్, శివ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల బెదిరింపులకు భయపడం



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

రామాయంపేట(మెదక్): కాంగ్రెస్ నాయకుల బెదిరింపులకు తాము భయపడబోమని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. ఆదివారం మున్సిపల్ మాజీ చైర్మన్ జితేందర్‌గౌడ్, సహకార సంఘం చైర్మన్ బాదె చంద్రం, పార్టీ యూత్ విభాగం మండలశాఖ అధ్యక్షుడు జలంధర్ విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో మెదక్ ఎలాంటి అభివృద్ధి సాధించలేదనే ఆరోపణల్లో ఎంతమాత్రం వాస్తవం లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి హయాంలోనే జిల్లాలో పెద్దఎత్తున అభివృద్ధి జరిగిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో మంజూరైన నిధులతోనే ప్రస్తుత ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేస్తున్నారని తెలిపారు. మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. సమావేశంలో నాయకులు అహ్మద్, హస్నొద్దీన్, శ్రీకాంత్‌సాగర్, చింతల రాములు, నరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

282 జీఓను రద్దు చేయాలి: సీఐటీయూ

శివ్వంపేట(నర్సాపూర్): పనిగంటల విధానాన్ని మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 282 జీఓను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమం కోసం పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హరిస్తున్నాయన్నారు. ప్రస్తుతం ఉన్న 8 గంటల పని విధానాన్ని 10 గంటలకు పెంచుతూ జారీ చేసిన జీఓను వెంటనే ఉపసంహరించాలని అన్నారు. కార్మిక హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్‌చేస్తూ ఈనెల 9వ తేదీ జరిగే జాతీయ సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక వర్గాలకు పిలుపునిచ్చారు.

పెంపుడు జంతువులకు టీకాలు తప్పనిసరి



పెంపుడు కుక్కలకు టీకాలు వేస్తున్న సిబ్బంది

నర్సాపూర్: పెంపుడు కుక్కలు, పిల్లుల ద్వారా వ్యాధి మనుషులకు రేబిస్ సోకుతుందని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పశు వైద్యాధికారి వెంకటయ్య సూచించారు. ఆదివారం ప్రపంచ జూనోసెస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక పశువైద్యశాలలో ఏర్పాటు చేసిన ఉచిత టీకాల కార్యక్రమాన్ని ఆశాఖ ఏడీ జనార్దన్‌రావుతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువుల నుంచి మనుషులకు వచ్చే వ్యాధులలో రేబిస్ భయంకరమైందని చెప్పారు. పెంపుడు జంతువులకు ప్రతి సంవత్సరం టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది గోవర్దన్, ఇక్బాల్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్యారానగర్‌కు గ్రీన్ ట్రిబ్యునల్

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి సమీపంలోని ప్యారానగర్ డంపింగ్ యార్డ్ పరిశీలనకు జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ అధికారులు ఉదయం 9 గంటలకు రానున్నట్లు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నాయకులు, గ్రామస్తులు, యువకులు, వ్యవసాయదారులు మహిళలు నిరసనకారులు తమ అభిప్రాయాన్ని తెలిపేందుకు సకాలంలో చేరుకోవాలని సూచించారు.

తనిఖీలతో బోధనెలా?

- పాఠశాలల పర్యవేక్షణకు సీనియర్ టీచర్లు
- విద్యాశాఖ ఉత్తర్వులతో దుమారం
- వ్యతిరేకిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు



జిల్లావ్యాప్తంగా 902 పాఠశాలలు ఉండగా, వీటి పరిధిలో 87 వేల పైచిలుకు విద్యార్థులు చదువుకుంటున్నారు. జిల్లాలో ఉపాధ్యాయ మంజూరు పోస్టులు 4,044 కాగా, ప్రస్తుతం పనిచేస్తున్న టీచర్లు 3,521 మంది మాత్రమే. ఈ లెక్కన ఇంకా 523 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇప్పటికే అరకొర సిబ్బందితో నెట్టుకొస్తున్నారు. చాలా వరకు ప్రైమరీ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య తక్కువ ఉన్న చోట రెండు, మూడు బడులకు కలిపి బోధిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో 10 సంవత్సరాల అనుభవం గల సీనియర్ ఎస్జీటీలను పాఠశాలల పర్యవేక్షణ కోసం నియమిస్తే ఇక బోధించేది ఎవరని పలువురు ప్రశ్నిస్తున్నారు.

100 మందికి ఒకరు చొప్పున

ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేసేందుకు పది సంవత్సరాల అనుభవం ఉన్న ప్రధానోపాధ్యాయుడు లేదా ఎస్జీటీలను నియమించాలి. అలాగే ప్రాథమికోన్నత (యూపీఎస్) పాఠశాలల తనిఖీ కోసం పదేళ్ల అనుభవం గల స్కూల్ అసిస్టెంట్‌ను నియమించుకోవాలి. వీరు రోజుకు ఒకటి చొప్పున మూడు మాసాల్లో 50 పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించి బోధన విధానం, విద్యార్థుల హాజరు, తదితర అంశాలపై డీఈఓకు నివేదికను అందించాల్సి ఉంటుంది. అయితే పాఠశాలల పర్యవేక్షణకు టీచర్లను ఎంపిక చేసే విధానాన్ని ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో కొనసాగే ఉన్నత పాఠశాలలను స్కూల్ అసిస్టెంట్లతో తనిఖీలు చేయించటం సరికాదంటున్నారు. ఇప్పటికే ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, సీఆర్‌పీలు ఉండగా, పాఠాలు చెప్పే సీనియర్ ఉపాధ్యాయులను తనిఖీల కోసం కేటాయిస్తే పిల్లల చదువులు కుంటుపడతాయని పేర్కొంటున్నారు. విద్యాశాఖ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతున్నారు.

నిర్ణయం విరమించుకోవాలి



ఉపాధ్యాయులు తనిఖీల బాధ్యత నిర్వహించడంతో విద్యా బోధన కుంటుపడుతుంది. ఎంఈఓలను శాశ్వతంగా నియమించి, వారి ద్వారా తనిఖీలు చేస్తే బాగుంటుంది. వారికి సపోర్టుగా కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులను వినియోగించుకోవాలి.

– చల్లా లక్ష్మణ్, తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రత్యేక టీంలు ఏర్పాటు చేయాలి



పాఠశాలల తనిఖీల కోసం ప్రత్యేకంగా టీంలను ఏర్పాటు చేయాలి. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా టీచర్ల కొరత ఉంది. బోధించే ఉపాధ్యాయులను తనిఖీల కోసం కేటాయిస్తే బోధన కుంటుపడుతుంది. విద్యా శాఖ ఈ నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలి.

– మల్లారెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు

కేజీబీవీల్లో మౌలిక వసతుల కల్పన



విద్యార్థినులను ప్రశ్నలు అడుగుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కలెక్టర్ రాహుల్‌రాజ్

వెల్దుర్తి(తూప్రాన్): కేజీబీవీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. ఆదివారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా వెల్దుర్తిలోని కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థులను గణితానికి సంబంధించిన పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. భౌతిక, రసాయన శాస్త్రానికి సంబంధించి విద్యార్థులు సరైన జవాబులు చెప్పకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. నెల రోజుల తర్వాత మరలా సందర్శిస్తానని అంతలోపు మంచిగా చదువుకొని తాను అడిగే ప్రశ్నలకు అందరూ సమాధానం చెప్పేలా సిద్ధంగా ఉండాలని సూచించారు. విద్యార్థినులు క్రమశిక్షణతో విద్యనభ్యసించడానికి ప్రభుత్వం కేజీబీవీల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తుందన్నారు. యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, రివైజ్ డైట్ మెనూ వంటి సౌకర్యాలతో పాటు గుణాత్మక విద్య ప్రమాణాలు మెరుగుకు కృషి చేస్తున్నట్టు వివరించారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని, విద్యార్థులు సైతం ప్రశాంతమైన వాతావరణంలో చదువుకుంటున్నారని తెలిపారు. గుణాత్మక విద్య కోసం 7, 8, 9 తరగతుల వారికి గ్రౌండ్ బేస్ లెర్నింగ్ కార్యక్రమాన్ని అమలు చేశామన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రాథమిక స్థాయి విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కార్యక్రమాన్ని అమలు చేసి చదవడం, రాయడం, గణితంలో ఉన్న సమస్యలను నివృత్తి చేయడం వంటి చర్యలు చేపట్టామన్నారు. లక్ష్యాన్ని ఎంచుకొని చదువులు కొనసాగించాలని సూచించారు. బడీడు పిల్లలను పనికి పంపించకుండా దగ్గరలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. అనంతరం కేజీబీవీ పాఠశాలలో ఖాళీగా ఉన్న పోస్టులతో ఉన్నవారిపై అదనపు భారం పడుతుందని, ఈ విషయంలో త్వరగా చర్యలు తీసుకోకుంటే తాము పని బంద్ చేయాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయని సిబ్బంది కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి రికార్డులు పరిశీలించారు. రోగులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఆయన వెంట అధికారులు, సిబ్బంది ఉన్నారు.

నీటి కష్టాలు తప్పవా?



కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్‌లో 4.93 టీఎంసీలకు పడిపోయిన నీటి నిల్వలు

- రిజర్వాయర్లలో పడిపోతున్న నీటిమట్టాలు
- రైతుల్లో కలవరం

గజ్వేల్: సాగునీటికి ఈసారి కూడా ఇబ్బందులు తప్పేలా లేవు. ప్రస్తుత వానాకాలంలో ఇప్పటివరకు భారీ వర్షాల జాడ లేదు. మరోవైపు జిల్లాలోని మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, రంగనాయకసాగర్ రిజర్వాయర్లలో నీటిమట్టం గణనీయంగా పడిపోయింది. ఇదే క్రమంలోనే ఈ రిజర్వాయర్లకు నీటిఎత్తిపోతలపై ఇప్పటికీ స్పష్టత లేదు. పరిస్థితి ఇదేవిధంగా కొనసాగితే వరి సాగుపై నీలినీడలు అలుముకోనున్నాయి. కాళేశ్వరంలో భాగంగా జిల్లాలో 3టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన రంగనాయకసాగర్, 50టీఎంసీల సామర్థ్యం కలిగిన మల్లన్నసాగర్, మరో 15 టీఎంసీ సామర్థ్యమున్న కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్లు ఉమ్మడి మెదక్ జిల్లా వ్యవసాయానికి ప్రస్తుతం ప్రధాన ఆధారంగా మారాయి. ఈ రిజర్వాయర్ల నిర్మాణం వల్ల జిల్లాలో భూగర్భజలమట్టం గణనీయంగా పెరగటమే కాకుండా, కాల్వల ద్వారా పొలాలకు నీరందే పరిస్థితి ఉంది. ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో వర్షాల జాడ లేకపోవడంతో.. రిజర్వాయర్లపై రైతులు ఆధారపడుతున్నారు.

జిల్లాలో 1.10 లక్షల ఆయకట్టు

రంగనాయక సాగర్ రిజర్వాయర్‌కు జిల్లాలో 1.10లక్షల ఆయకట్టు ఉంది. ఇక్కడి నుంచి 2.2 కిలోమీటర్ల ఓపెన్ కెనాల్, మరో 16.2 కిలోమీటర్ల టన్నెల్ ద్వారా మల్లన్నసాగర్‌కు గోదావరి జలాలు వస్తాయి. మల్లన్నసాగర్‌తో సిద్దిపేట, మెదక్ జిల్లాలే కాకుండా ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాల్లో 15.71 లక్షల ఆయకట్టుకు మేలు చేకూరనుంది. మల్లన్నసాగర్ నుంచి గోదావరి జలాలు కొండపోచమ్మసాగర్‌ను చేరుతాయి. మల్లన్నసాగర్ పంపుహౌస్ నుంచి 23 కిమీల పొడవున కొండపోచమ్మ సాగర్ వరకు కాలువల ద్వారా గోదావరి నీళ్లు వస్తున్నాయి. 15 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ వల్ల సిద్దిపేటతో పాటు మేడ్చల్, సంగారెడ్డి, మెదక్, యాదాద్రి జిల్లాల్లోని 2.85లక్షల ఎకరాలకు సాగునీరు అందనుంది. ఇందులో జిల్లాలో 1.25 లక్షల ఎకరాలకు సాగునీరు అందనున్నది. దీంతో పాటు పరోక్షంగా మరెన్నో లక్షల భూముల్లో భూగర్భ జలమట్టం పెరిగి భారీ ప్రయోజనం కలుగుతున్నది.

ఎత్తిపోతలపై స్పష్టత కరువు

మల్లన్నసాగర్‌లో ప్రస్తుతం 10.25టీఎంసీలు, కొండపోచమ్మసాగర్‌లో 4.93టీఎంసీలు, రంగనాయకసాగర్‌లో 1.05 టీఎంసీల నీటి నిల్వ మాత్రమే ఉందని అధికారులు చెబుతున్నారు. మేడిగడ్డ ఘటన నేపథ్యంలో అక్కడి నుంచి నీటిని లిఫ్ట్ చేయడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఎల్లంపల్లి ప్రాజెక్ట్ ప్రత్యామ్నాయ మార్గంగా మారుతోంది. గతేడాది ఎల్లంపల్లి నుంచే మల్లన్నసాగర్ రిజర్వాయర్‌ను 21 టీఎంసీలతో నింపారు. కొండపోచమ్మసాగర్, రంగనాయకసాగర్ సైతం సగం మేర నీళ్లు వచ్చాయి. కానీ ఈ నీళ్లు సరిపోక ఇబ్బందులు తప్పలేదు. ఈసారి మాత్రం మల్లన్నసాగర్‌కు 40టీఎంసీలకు పైగా, కొండపోచమ్మసాగర్ 12కిపైగా రంగనాయకసాగర్‌లో 2టీఎంసీలకుపైగా నింపితేనే ఇబ్బందులు తీరే అవకాశం ఉంది. గోదావరి నదిపై నిర్మించిన శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ గుండా ఏర్పాటు చేసిన మోటార్లతో వరద ఉధృతంగా ఉన్న సమయంలో రోజుకూ 2 టీఎంసీలను నీటిని మిడ్‌మానేరు రిజర్వాయర్‌లోకి ఎత్తిపోసి అక్కడి నుంచి అనంతగిరి అన్నపూర్ణ రిజర్వాయర్ గుండా జిల్లాలోని రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్‌లను నింపే వీలుంది. వర్షాకాలంలో రెండు నెలల పాటు సుమారు మూడు రిజర్వాయర్లలో కలుపుకొని సుమారుగా 50 టీఎంసీలకుపైగా నింపుకునే అవకాశమున్నది. వర్షాలకు వచ్చే వరదతోనే సహజంగా ఇలా చేసే అవకాశమున్నది. దీని ద్వారా ప్రస్తుతం నెలకొన్న సాగు, తాగు నీటి ఇబ్బందులకు చెక్ పడనున్నది. కానీ ఈ విషయంలో ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

మెదక్ మున్సిపాలిటీ: మహనీయులను నేటి యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జిలు విజయ్‌కుమార్, సైదులు పేర్కొన్నారు. బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం జిల్లా కేంద్రంలోని గోల్కొండ వీధిలో ఆయన విగ్రహానికి పూలమాల నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. జగ్జీవన్‌రామ్ దేశానికి ఎనలేని రాజకీయ సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్, జిల్లా కార్యనిర్వాక ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు బాలరాజ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న క్షేత్రంలో భక్తుల రద్దీ



స్వామివారి రాజగోపురం ఎదుట భక్తుల రద్దీ

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లన్న క్షేత్రం ఆదివారం భక్తుల రాకతో సందడిగా మారింది. ఆలయ పరిసరాలు మల్లనామస్మరణతో మారుమోగాయి. క్షేత్రానికి చేరుకున్న భక్తులు పుష్కరిణి స్నానమాచరించి స్వామి వారిని దర్శించుకున్నారు. అభిషేకాలు, పట్నాలు, గంగిరేణి చెట్టుకు ముడుపులు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను ఈఓ అన్నపూర్ణ, పర్యవేక్షకులు శ్రీరాములు, సురేందర్‌రెడ్డి, ఆలయ ప్రధానార్చకులు మహాదేవుని మల్లికార్జున్‌లు పర్యవేక్షించారు.

జూనియర్ కాలేజీలకు మహర్దశ

- జిల్లాలోని 14 కళాశాలల్లో వసతుల కల్పన
- రూ. 3.26 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

నిధుల కేటాయింపులు ఇలా..

కళాశాల	మంజూరైన నిధులు (రూ. లక్షల్లో)
టేక్మాల్	21
మెదక్ బాలుర కళాశాల	13.1
మెదక్ బాలికల కళాశాల	11
కొల్చారం	24
నర్సాపూర్	30.50
పెద్దశంకరంపేట	26.50
చిన్నశంకరంపేట	19
చేగుంట	32
రామాయంపేట	27
తూప్రాన్	24
కౌడిపల్లి	21.70
అల్లాదుర్గం	19
వెల్దుర్తి	23.50
పాపన్నపేట	34.50



రామాయంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల

రామాయంపేట(మెదక్): ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు మంచి రోజులొచ్చాయి. విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో కూడిన మెరుగైన విద్యను అందించేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. జిల్లా పరిధిలోని 14 కళాశాలలకు రూ. 3.26 కోట్లు మంజూరు చేసింది. దశాబ్ద కాలం తర్వాత జూనియర్ కళాశాలలకు నిధులు మంజూరు కావడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. నెల రోజుల్లోపు పనులు పూర్తి చేసే దిశగా అధికారులు కసరత్తు చేస్తుండగా, పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో పనులు చేయించనున్నారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 16 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా, వీటిలో 9,390 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అయితే చాలా వరకు కళాశాలలు సమస్యలతో సతమతమవుతున్నాయి. ఏళ్ల తరబడి నెలకొన్న సమస్యలతో విద్యార్థులతో పాటు అధ్యాపకులు ఇబ్బందులపాలవుతున్నారు. ఎట్టకేలకు ఇంటర్ బోర్డు వీరి మొరను ఆలకించి కళాశాలల్లో వసతుల కల్పనకు నిధులు విడుదల చేసింది.

చేపట్టబోయే పనులు..

కళాశాలల్లో తాగునీటి ఎద్దడి తీర్చడం, విద్యుత్ సమస్యల పరిష్కారం, పైపులైన్ల లీకేజీ అరికట్టడం, మూత్రశాలలు, మరుగుదొడ్ల మరమ్మతులు, గ్రీన్ బోర్డుల ఏర్పాటు, ఫర్నీచర్ కొనుగోలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ఈ నిధులను వెచ్చించనున్నారు.

సమస్యలు పరిష్కారం



జిల్లావ్యాప్తంగా 14 కళాశాలలకు మంజూరైన నిధులతో చాలా వరకు ఇబ్బందులు తీరుతాయి. అత్యవసర సమస్యల పరిష్కారం కోసం ఇంటర్ బోర్డు ఈ నిధులను మంజూరు చేసింది. వీటిని సద్వినియోగం చేసుకోవాలి.

– మాధవి, జిల్లా నోడల్ అధికారిణి

క్లుప్తంగా

పాండురంగాశ్రమంలో తొలి ఏకాదశి వేడుకలు



మాధవానంద స్వామి ఆశీస్సులు తీసుకుంటున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

మర్కూక్(గజ్వేల్): శ్రీ పాండురంగస్వామి ఆశీస్సులు ప్రజలపై ఉంటాయని ప్రతి ఒక్కరూ హరేరామ నామస్మరణను జపించాలని మాధవానంద సరస్వతి పీఠాధీశులు మాధవానంద స్వామి తెలిపారు. భవానందాపూర్ గ్రామంలోని పాండురంగాశ్రమంలో త్రీరాత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం తొలి ఏకాదశి సందర్భంగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. వారికి మాధవానంద స్వామి ఆశీస్సులు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనా రెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రామేశ్వర్‌గౌడ్, ఆనందరెడ్డి, శ్రీనివాస్‌రావు,రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు

రగ్బీ పోటీలకు విద్యార్థుల ఎంపిక



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

చేగుంట(తూప్రాన్): జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు చేగుంట స్పోర్ట్స్ స్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థినులు ఎంపికై నట్లు రగ్బీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గణేష్ రవికుమార్ తెలిపారు. ఆదివారం ఆయన పోటీలకు సబంధించిన వివరాలు వెల్లడించారు. సికింద్రాబాద్‌లో శనివారం నిర్వహించిన అండర్-18 రగ్బీ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థినులు నందిని, దీపిక, సంపూర్ణ, అంకిత విజయం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.వీరంతా ఈనెల 8నుంచి ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు తరళి వెళ్లారు. విద్యార్థినులు జాతీయ పోటీలకు ఎంపిక కావడం పట్ల స్పోర్ట్స్ స్కూల్ ప్రిన్సిపాల్ సుమతి, రజిత హర్షం వ్యక్తం చేశారు.

క్రీడల్లో సత్తా చాటాలి



సర్టిఫికెట్లు అందుకున్న క్రీడాకారులు

గజ్వేల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో సత్తా చాటాలని ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాంగారి గణేష్ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీలో ఇటీవల ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫుట్‌బాల్ సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్న క్రీడాకారులకు ఆదివారం సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్న క్రీడాకారులు ఫుట్‌బాల్‌లో నైపుణ్యాన్ని ప్రదర్శించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు సాధించాలన్నారు. క్రీడల ద్వారా శారీరక ధారుడ్యంతో పాటు క్రమశిక్షణ అలవడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్ నర్సింహులు, సుగుణాకర్‌రెడ్డి, చక్రపాణి, ఎల్లయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నేడు మంత్రుల పర్యటన

హుస్నాబాద్: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి సోమవారం హుస్నాబాద్ పట్టణంలో పర్యటించనున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి తెలిపారు. మంత్రులు యువకుల్లో క్రీడా స్ఫూర్తిని నింపడానికి స్థానిక మినీ స్టేడియాన్ని సందర్శించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే సిద్దిపేట రోడ్డులో మరో మినీ స్టేడియాన్ని ఏర్పాటు చేయాలని కోరనున్నట్లు లింగమూర్తి తెలిపారు.

పేదలకు ఇందిరమ్మ ఇల్లు కలేనా?



ఏళ్లు గడిచినా.. ఎదురుచూపులే

- ఇల్లు మంజూరు చేయాలని వేడుకోలు
- అసలైన అర్హులకు అన్యాయం
- పట్టించుకోని అధికారులు



రేకుల షెడ్‌లో పిట్ల ఆంజనేయులు కుటుంబం

దుబ్బాకటౌన్: ఈ ఫొటోలో కనబడుతున్న కుటుంబ యజమాని పేరు పిట్ల ఆంజనేయులు. వీరిది రాయపోల్ మండలం టెంకంపేట గ్రామం. వీరు 15 ఏళ్లుగా రేకుల షెడ్డులోనే నివాసం ఉంటున్నారు. కానీ వీరికి ఇటీవల చేపట్టిన ఇందిరమ్మ ఇంటి పథకంలో మంజూరి పత్రం రాకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు.

ఇంటింటి సర్వే

కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇంటి పథకం ద్వారా కనీసం గూడులేని నిరుపేదలకు ఉచితంగా ఇంటి నిర్మాణం కోసం రూ. 5 లక్షలతో రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్ల చొప్పున మొదటి విడుతలో మంజూరు చేశారు. గ్రామాల్లో ప్రజా పాలన ద్వారా ఇల్లు లేని నిరుపేదల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు సర్వే చేసి దరఖాస్తుదారుల్లో నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేసి ఇల్లు కేటాయించాల్సి ఉంది.

పేదలు కనిపిస్తలేరా?

అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులకు అర్హులు కనిపించడం లేదా? ఇది పేదల ప్రభుత్వం అని చెప్పే ప్రభుత్వానికి అసలైన పేదలను ఎందుకు గుర్తించడం లేదంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు స్పందించి నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని బాధితులు గ్రామస్తులు, కోరుతున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి శశికుమార్‌ని వివరణ కోరగా... గ్రామం నుంచి మొదటి విడతలో 14 మంది లబ్ధిదారులను ఎంపిక చేయగా 10 మందికి ఇల్లు మంజూరయ్యాయని తెలిపారు. మరో నాలుగు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న లిస్టులో ఆంజనేయులు పేరు ఉంది. అలాగే ఎక్కాల స్వామి ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకోలేదు. ఆయనకు మంజూరు కాలేదు. దరఖాస్తు చేసుకుంటే రెండో విడతలో కృషి చేస్తామని చెప్పారు.

ఏళ్లుగా రేకుల షెడ్డులోనే..

రాయపోల్ మండలంలో టెంకంపేట గ్రామంలో మొదటి విడతలో 10 ఇళ్లు మంజూరయ్యాయి. పది ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేసి నిజమైన అర్హులకు కేటాయించాల్సి ఉంది. కానీ 15 ఏళ్లుగా రేకుల షెడ్డు వేసుకొని దానికి టార్పాలిన్ కవర్ కప్పుకొని ఎండకు, వానకు తడుచుకుంటూ బిక్కుబిక్కుమంటూ నివాసముంటున్న నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాకపోవడం శోచనీయం. టెంకంపేట గ్రామానికి చెందిన పిట్ల ఆంజనేయులు, ఎక్కాల స్వామి ఈ రెండు కుటుంబాలు నిజమైన అర్హులు అయినప్పటికీ ఇందిరమ్మ ఇండ్ల అర్హత లిస్టులో వీళ్ల పేర్లు రాకపోవడం బాధాకరం. పిట్ల ఆంజనేయులుకు మతిస్థిమితం లేదు. అతని భార్య గతంలోనే మృతి చెందింది. వీరి కుమారుడు రజినీకాంత్, కోడలు మౌనిక ముగ్గురు ఇదే రేకుల షెడ్డులో నివాసం ఉంటున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో రేకులకు రంధ్రాలు పడి వర్షం నీరు ఇంట్లోకి వస్తుంది. అలాగే ఎక్కాల స్వామి కుటుంబ నేపథ్యం కూడా ఇలాంటి పరిస్థితే. గ్రామంలో కూలీ నాలి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. భార్య, ఇద్దరు పిల్లలతో రేకుల షెడ్డులోనే నివాసం ఉంటున్నారు.



ఎక్కాల స్వామి కుటుంబం

జోరుగా మట్టి దందా

- మాయమవుతున్న గుట్టలు
- కన్నెత్తి చూడని అధికారులు



రేగొండ గ్రామ ఊరచెరువు పక్కన ఉన్న గుట్టను తవ్వుతున్న హిటాచీ

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలో మట్టి మాఫియా దందా జోరుగా సాగుతోంది. ఎవరైనా ప్రశ్నిస్తే దౌర్జన్యానికి దిగేందుకు సైతం వెనుకాడటం లేదని స్థానికులు వాపోతున్నారు. రేగొండ గ్రామ ఊరచెరువుకు ఆనుకొని ఉన్న గుట్టను కొన్ని రోజులుగా తవ్వుతున్నారు. ఈ గుట్ట మొత్తం సుమారుగా 15నుంచి 20 ఎకరాల వరకు ఉంటుంది. గుట్ట వద్ద రాత్రింభవళ్లు జేసీబీలతో తవ్వుతూ వందలాది వాహనాల్లో మట్టిని తరలిస్తున్నారు. ఎవరైనా అడిగితే గుట్ట మా పేరుపై పట్టా ఉందని చెబుతున్నారు. వాహనాల రాకపోకలతో ఊరచెరువు కట్టకు ప్రమాదం పొంచి ఉందని చుట్టూ పక్కల రైతులు వాపోతున్నారు. అలాగే చెరువు కట్ట కృంగిపోయే ప్రమాదం కూడా ఉందన్నారు. గుట్టలను, ప్రభుత్వ భూములను రక్షించాల్సిన ప్రభుత్వ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడకపోవడంపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ అనంతరెడ్డిని వివరణ కోరగా... గుట్టను తవ్వుతున్న అంశం మా పరిధిలోకి రాదు, మైనింగ్ శాఖ అధికారులు చూడాలని పేర్కొన్నారు. గుట్ట అనేది ఎవరి పేరుపై పట్టా ఉండదని చెప్పారు.

ఘనంగా విఠలేశ్వర స్వామి పల్లకీ సేవ



పల్లకీసేవ నిర్వహిస్తున్న నిర్వాహకులు

దుబ్బాక: పట్టణంలో తొలి ఏకాదశిని పురస్కరించుకొని ఆదివారం విఠలేశ్వరస్వామి పల్లకీ సేవ ఊరేగింపు ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా పట్టణంలోని ప్రధాన వీధుల గుండా భజనలు, సాంస్కృతిక ప్రదర్శనలతో ఉత్సవ విగ్రహంతో స్వామివారి పల్లకీ సేవ కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి

ముగ్గురు యువకులపై కేసు నమోదు

సిద్దిపేటకమాన్: ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి చేసిన ఘటనలో ముగ్గురు యువకులపై కేసు నమోదైంది. ఈ ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. సిద్దిపేట ఆర్టీసీ డీఎం రఘు, అధికారుల వివరాల ప్రకారం... వేములవాడ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు వేములవాడ నుంచి హైదరాబాద్‌కు ప్రయాణికులతో వెళ్తోంది. గుర్రాలగొంది గ్రామంలో స్టేజీ వద్ద ప్రయాణికులను ఎక్కించుకునే క్రమంలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆర్టీసీ సిబ్బందితో వాగ్వాదానికి దిగగా గ్రామస్తులు అతడిని వారించారు. తరువాత ఆ వ్యక్తి అక్కడే బస్సు దిగి వెళ్లిపోయాడు. బస్సు సిద్దిపేట నూతన బస్టాండ్‌కు వచ్చే సరికి అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు గణేశ్, నగేశ్, సతీశ్ డ్రైవర్ నరసప్పై దాడి చేశారు. ఈ ఘటనను కండక్టర్ తన సెల్‌ఫోన్‌లో వీడియో తీస్తుండగా మొబైల్‌ను సైతం పగులగొట్టారు. ఈ ఘటనపై సిద్దిపేట డిపో ఆన్‌డ్యూటీ కంట్రోలర్ వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

సాగుకు దన్ను ఎత్తిపోతలు



చెరువు కింద వరి నాట్లకు సిద్ధంగా ఉన్న పొలాలు

కొల్చారం(నర్సాపూర్): మండల వ్యాప్తంగా సాధారణ వర్షపాతం కూడా నమోదు కాని పరిస్థితి. బోర్ల కింద పంటలు సాగు చేసే రైతులు వరి నాట్లు వేసే పనుల్లో బిజీగా ఉన్నారు. మరోవైపు నల్లరేగడి భూముల్లో వర్షాధారిత పంటలు పత్తి, మొక్కజొన్న, ఇతర పంటలు సాగు చేస్తున్నారు. మండలంలో పూర్తిగా వరిని సాగు చేసే రైతులు బోర్ల కింద నాటు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. అటు పెద్ద చెరువులో ఆశించిన స్థాయిలో నీరు లేకపోవడంతో బోరు బావుల నుంచి నీరు వస్తాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. దీంతో రైతులు గ్రామం గుండా ప్రవహించే మంజీరా నదిపై నిర్మించిన ఎత్తిపోతల ద్వారా పెద్ద చెరువులోకి నీటిని పంపిస్తున్నారు. అయితే ఎత్తిపోతలకు సంబంధించి మోటార్ల సామర్థ్యం తక్కువగా ఉండటంతో అనుకున్న మేరకు నింపలేకపోతున్నారు. ప్రభుత్వం స్పందించి కొత్త మోటార్లను మంజూరు చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

ఐఐటీ మద్రాస్‌తో భాగస్వామ్యం

జక్కాపూర్ పాఠశాల హెచ్ఎం వెల్లడి

సిద్దిపేటరూరల్: స్కూల్ కనెక్ట్ పేరుతో ఐఐటీ మద్రాస్ నిర్వహిస్తున్న కార్యక్రమానికి నారాయణరావుపేట మండల పరిధిలోని జక్కాపూర్ పాఠశాల భాగస్వామ్యం అవుతున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షౌకత్ అలీ ఆదివారం తెలిపారు. ఐఐటీలో చేరడానికి కావలసిన ప్రాథమిక విషయాలైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ వంటి వివిధ కోర్సులకు సంబంధించిన ప్రాథమిక విషయాలు, కోడింగ్‌పై అవగాహన, ఐఐటీ ప్రొఫెసర్ల చేత ఆన్‌లైన్ ద్వారా జక్కాపూర్ విద్యార్థులు నేర్చుకోబోతున్నారని వివరించారు. దీనికి సంబంధించి పూర్తి విధి విధానాలను త్వరలో పాఠశాలకు అందించనున్నట్లు ఐఐటీ ప్రతినిధులు మెయిల్ ద్వారా తెలియజేశారన్నారు. ప్రస్తుత పదవ తరగతి విద్యార్థులతో పాటు రాబోయే రెండేళ్లు కూడా ఈ భాగస్వామ్యంతో విషయ పరిజ్ఞానాన్ని నేర్చుకోనున్నారు. ఇప్పటికే పీఎంశ్రీ జెడ్పీహెచ్ఎస్ జక్కాపూర్ విద్యార్థులు రాష్ట్ర, జిల్లా స్థాయిలో ర్యాంకులు సాధిస్తూ ఉత్తమ పాఠశాలగా నిలబెట్టారని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ఎంపికయ్యేందుకు కృషి చేసిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు రాజేందర్‌ను అభినందించారు.



జక్కాపూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాల

కార్మికుల హక్కుల కోసం పోరాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న చుక్క రాములు

సిద్దిపేటఅర్బన్: కార్మికుల హక్కుల కోసం పోరాటం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్క రాములు పిలుపునిచ్చారు. ఆదివారం సిద్దిపేటలో పార్టీ జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశ వ్యాప్తంగా జూలై 9న జరగనున్న సమ్మెను కార్మికులు, ప్రజలు జయప్రదం చేయాలన్నారు. కేంద్రానికి వ్యతిరేకంగా పోరాడుతున్నామన్న సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో పని గంటలను 8 నుంచి 10 గంటలకు పెంచుతూ జీవోలు జారీ చేయడం దేనికి సంకేతమో చెప్పాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం చట్టాలను మార్చి కార్మికుల హక్కులను హరిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. సంఘాలు పెట్టుకునే హక్కు లేకుండా చేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి, నాయకులు గోపాలస్వామి, శశిధర్, ఎల్లయ్య, సత్తిరెడ్డి, భాస్కర్, వెంకట్, యాదగిరి, అరుణ్‌కుమార్, రవికుమార్, రవీందర్, నవీన, శారద, శ్రీనివాస్, కృష్ణారెడ్డి, శిరీష, ప్రశాంత్ పాల్గొన్నారు.

రేబిస్ నివారణకు చర్యలు

జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా.వసంత కుమారి

సంగారెడ్డి జోన్: రేబిస్ వ్యాధి నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ వసంతకుమారి తెలిపారు. ఆదివారం జునోసిస్ డేను పురస్కరించుకుని సంగారెడ్డి పట్టణంలోని జిల్లా పశు వైద్యశాలలో కుక్కలకు ఉచితంగా టీకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్రమిత వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తలు వహించాలన్నారు. పెంపుడు కుక్కల యజమానులు తమ కుక్కలకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మునీర్ అహ్మద్, ఏడీ డాక్టర్ పవన్, అధికారులు డా.అనిత చంద్ర, కనకలక్ష్మి, ఉస్మాన్, తదితరులు పాల్గొన్నారు.



టీకాలు పంపిణీ చేస్తున్న జాయింట్ డైరెక్టర్ వసంతకుమారి తదితరులు

ఐఎల్ఓ ఒప్పందాన్ని విస్మరించిన కేంద్రం



పరిశ్రమ వద్ద ఐఎన్‌టీయూసీ రాష్ట్ర, జిల్లా నాయకులు

ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్

పటాన్‌చెరు టౌన్: అంతర్జాతీయ లేబర్ ఆర్గనైజేషన్ ఒప్పందం ప్రకారం కేంద్ర ప్రభుత్వం ఐఎల్ఓ -81 ఒప్పందాన్ని పూర్తిగా విస్మరించి, పరిశ్రమలో అధికారుల తనిఖీ లేకుండా పరిశ్రమ యాజమాన్యాలకు పూర్తి స్వేచ్ఛనిచ్చిందని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ ఆరోపించారు. ఆదివారం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధి.. పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచీ పరిశ్రమను నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. పరిశ్రమల బాయిలర్ శాఖ అధికారులను సస్పెండ్ చేయాని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర్, ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ప్రమాదం జరిగిన మరుసటి రోజు బాధితులను పరామర్శించి, పరిహారం ఇప్పించారని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయ్ కుమార్ యాదవ్, సమద్, జిల్లా కార్యదర్శి సుందర్, విజయ్ కుమార్ గౌడ్, సంజీవ్, సంపత్, రాజేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులకు చేయూత

ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని ఎదిగిన వ్యక్తి బడిని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ప్రత్యేక నిధులు మంజూరు చేయించారు. సింగరేణి సంస్థ తోడ్పాటుతో ప్రత్యేక భవనాలు, సైన్స్ మ్యూజియం, మౌలిక వసతుల కల్పనకు కృషి చేశాడు. విద్యార్థులకు విజ్ఞాన శాస్త్రంపై మరింత అవగాహన పెంచడానికి మ్యూజియంలో పలు ఎగ్జిబిట్లను ఏర్పాటు చేశారు.

– శివ్వంపేట(నర్సాపూర్):

- చిన్నగొట్టిముక్లలో పాఠశాల భవనం..
- శివ్వంపేటలో సైన్స్ మ్యూజియం ఏర్పాటు
- సింగరేణి సంస్థ తోడ్పాటు
- మాజీ సీఎంఓ కృషితో నిధులు

రూ.2కోట్లతో పాఠశాల భవనం

మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల గ్రామానికి చెందిన సింగాయిపల్లి నర్సింగరావు గ్రామంలో ప్రాథమిక విద్య అనంతరం శివ్వంపేటలో 10వ తరగతి వరకు చదువుకుని ఉన్నత స్థాయికి ఎదిగాడు. కలెక్టర్‌గా, సింగరేణి సంస్థ, కోల్ ఇండియా సంస్థ చైర్మన్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందారు. ఆయన సీఎంఓ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న సమయంలో పాఠశాల అభివృద్ధికి సింగరేణి సంస్థ నుంచి రూ.3 కోట్ల నిధులు మంజూరు చేయించారు. రూ.2కోట్లతో చిన్నగొట్టిముక్లలో పాఠశాల భవనం, డైనింగ్ హాల్, క్రీడా మైదానం, ప్రహరి గోడ, అంగన్‌వాడీ భవనం నిర్మించారు.

రూ.కోటితో సైన్స్ మ్యూజియం

విద్యార్థులకు విజ్ఞానాన్ని పెంపొందించేందుకు మండల కేంద్రమైన శివ్వంపేటలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్ మ్యూజియం ఏర్పాటు చేశారు. మెదక్ జిల్లాలో ఇది మొట్టమొదటిది. సింగరేణి సంస్థ ద్వారా మంజూరైన రూ.కోటి నిధుల్లో రూ.70 లక్షలతో ప్రత్యేక విశాలమైన భవనం నిర్మించి అందులో మ్యూజియం ఏర్పాటు చేశారు. రూ.30 లక్షలతో సైన్స్ పరికరాలు (ఎక్విప్మెంట్స్) కొనుగోలు చేశారు.



అస్థి పంజరాన్ని చూస్తున్న విద్యార్థిని



మ్యూజియంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు



చిన్నగొట్టిముక్లలో నిర్మించిన పాఠశాల భవనం

విద్యార్థులకు విజ్ఞాన గని

సాధారణంగా విద్యార్థులు సైన్స్, గణితం పాఠ్యాంశాలను కఠినంగా భావిస్తారు. దీనిని దృష్టిలో ఉంచుకుని జీవ, భౌతిక, రసాయన, గణిత శాస్త్రాలపై విద్యార్థులకు ప్రత్యక్ష అవగాహన కల్పించేందుకు, సబ్జెక్టులపై పట్టు సాధించేందుకు వీలుగా మ్యూజియాన్ని తీర్చిదిద్దారు. బిర్లా సైన్స్ మ్యూజియం ద్వారా జీవశాస్త్రం, భౌతిక, రసాయన, గణిత శాస్త్రాలపై అవగాహన కల్పించేలా మ్యూజియంలో పలు ఎగ్జిబిట్లను ఉంచారు. మానవుని జీర్ణ వ్యవస్థ, అస్థి పంజరం, వివిధ శాస్త్రవేత్తల పరిశోధనలు, జీవిత చరిత్రలు, రంగు నీడలు, తేలియాడే బంతి, అనంతమైన బావి, వివిధ రకాల కంపనాలు, అవి సృష్టించే ధ్వని, గురుత్వాకర్షణ, చలనచిత్ర దర్శిని, కక్ర విన్యాసం, డైనమో, బ్లాక్ హోల్, పైథాన్ సిద్ధాంతాన్ని వివరించే పలకలు, సంభావ్యతను తెలియచేసే పరికరం తదితర సైన్స్ ఎక్విప్‌మెంట్స్‌ను ఏర్పాటు చేశారు.


సైన్స్‌పై పట్టు సాధించవచ్చు



విద్యార్థులు ఈ మ్యూజియంను సందర్శిస్తే సైన్స్‌పై అవగాహన పెరుగుతుంది. ముఖ్యంగా ఇక్కడ ఉన్న ఎగ్జిబిట్లు, పరికరాలను చూసి వాటి పనితీరు, ఫలితాలు తెలుసుకోవడం ద్వారా విజ్ఞాన శాస్త్రంపై పట్టు సాధించవచ్చు. జిల్లాలోని పలు పాఠశాలల విద్యార్థులకు ఈ సైన్స్ మ్యూజియం ఎంతగానో ఉపయోగపడుతుంది.

– రాధాకిషన్, డీఈఓ

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు



సమాజంలో ఉన్నత చదువుతోనే ప్రతి ఒక్కరికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో బోధన అందుబాటులో ఉంది. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఎంచుకుని ఏకాగ్రతతో చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలి.

– నర్సింగరావు, మాజీ సీఎంఓ